క్లుప్తంగా

జీవనోపాధి కోసం ప్రత్యేక చర్యలు



సమావేశమైన స్వయంశక్తి సంఘాలతో సెర్ప్ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: స్వయంశక్తి సంఘాల్లోని ప్రతి మహిళ జీవనోపాధి మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. హరిపురం గ్రామంలో స్వయం శక్తి సంఘాలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హత గల ప్రతి కుటుంబం నుంచి సభ్యుల వ్యక్తిగత, వారి సంస్థల ఉమ్మడి జీవనోపాధి కార్యక్రమాలపై శ్రద్ధ తీసుకుంటామని అన్నారు. ఎస్‌డీజీ లక్ష్య సాధన దిశలో మరింత మెరుగైన కార్యక్రమాలు రూపకల్పనకు సెర్ప్ ద్వారా విద్యా, ఉపాధి సమగ్ర సమాచారం సేకరిస్తున్నట్టు వెల్లడించారు.

8 ఎక్సైజ్ కేసులు నమోదు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వారం రోజుల్లో చేసిన దాడుల్లో ఎనిమిది కేసులు నమోదయ్యావని ఎస్‌ఐ పి.డి.ప్రసాద్ తెలిపారు. దాడులో ఒడిశాకి చెందిన 11 బీరు, 77 మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.. పట్టుబడిన వారిలో పాతకేసులతో సంబంధం ఉన్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

ఇచ్ఛాపురం: జాతీయరహదారి–16పై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పోలీసులను కోరారు. బెల్లుపడ కూడలిలో స్టాపర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఈ కారణంగా చాలా మంది మృత్యువాత పడుతున్నారని.. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైనచోట్ల స్టాపర్లు ఏర్పాట్లు చేయాలని హైవే సిబ్బంది, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



కంచిలి: కంచిలి పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా నియమితులైన పి.పారినాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం ఎస్‌బీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. పారినాయుడుకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జి.రాజేష్‌కు శ్రీకాకుళం వీఆర్‌కు పంపిస్తూ జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి ఉత్తర్వులిచ్చారు.

108 వాహనంలో ప్రసవం



భారతిని పరిశీలిస్తున్న వాహన సిబ్బంది

నందిగాం: రధజనబొడ్డపాడు పంచాయతీ కందులగూడెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ జి.భారతి 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. కొండల ప్రాంతంలోని కందులగూడెంకు చెందిన భారతికి ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో నందిగాం 108 వాహనానికి కుటుంబ సభ్యులు కాల్ చేశారు. గ్రామానికి వాహనం చేరుకొని ఎక్కిస్తున్న సమయంలోనే నొప్పులు అధికం కావడం గమనించిన ఈఎంటీ రాము, పైలట్ కుమారస్వామి అంబులెన్స్‌లోనే ప్రసవం చేయించారు. అనంతరం టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తల్లీబిడ్డను తరలించారు. సుఖ ప్రసవం చేయించిన వాహన సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

సత్యసాయి బోధనలు అనుసరణీయం



పూజలు చేస్తున్న భక్తులు

వజ్రపుకొత్తూరు: భగవాన్ సత్య సాయిబాబా బోధనలు అనుసరణీయమని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి అన్నారు. పూండి– గోవిందపురం గ్రామంలో కొంచాడ గోవిందరావు, కుటుంబ సభ్యులు రూ.30 లక్షలతో నిర్మించిన సత్యసాయి బాబా మందిరం ప్రారంభోత్సవం, పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు దంపతులు సత్యన్నారాయణ వ్రతం, లక్ష్మీ పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం హోమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కొంచాడ ధర్మారావు, వెంకటరావు నూకరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ పాలిన రమ్య, చిరంజీవి ఉన్నారు.

బోధన సాగేదెలా?

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత
- సర్దుబాటులో కూడా తీరని సమస్య
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఆందోళనలో ఒడియా మీడియం పిల్లలు



ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. నియోజకవర్గ కేంద్రమైన ఇచ్ఛాపురం పట్టణంలో ఉన్న శతాబ్దకాలం చరిత్ర కలిగిన పాఠశాలలోని విద్యార్థులను టీచర్ల కొరత ఆందోళనకు గురిచేస్తోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థపై పూర్తిస్థాయిలో దృష్టి సారించక పోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో కూడా టీచర్ల కొరత తీరలేదు. ఫలితంగా విద్యాబోధన కుంటుపడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో ఆందోళన నెలకొంది. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్, ఒడియా మాధ్యమాలకు సంబంధించి సుమారు పన్నెండు వందల మంది విద్యార్థులున్నారు. ఇక్కడకు పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తుంటారు. వీరితో పాటు ఒడియా విద్యార్థులు కూడా ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించేందుకు చేరుతుంటారు. మూడు మాధ్యమాల్లో విద్యా బోధన సాగుతూ ఉంటుంది. జిల్లాలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇది ఒకటి. విద్యార్థులకు బోధన చేసేందుకు 55 మంది ఉపాధ్యాయులు అవసరం. అయితే ప్రస్తుతం కేవలం 35 మంది ఉపాధ్యాయులుండగా ఇటీవల జరిగిన సర్దుబాటుతో వీరిసంఖ్య 39కి చేరింది. అంటే కేవలం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే అదనంగా నియమితులయ్యారు. ఉపాధ్యాయ సిబ్బంది తగినంతమంది లేకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన సాగడం లేదు. ఒడియా మీడియం విద్యార్థులకు సైన్స్ (ఫిజికల్, బయాలజికల్ సైన్స్) బోధించే ఉపాధ్యాయులెవరూ లేకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఒడియా ఉపాధ్యాయుల కొరత కారణంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న 309 మంది విద్యార్థుల భవిష్యత్ ఆందోళనగా మారింది. మిగిలిన సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రస్తుతానికి తరగతులను నెట్టుకొస్తున్నారు. అయితే వీరిపై కూడా పనిభారం పెరిగిపోతుంది. పాఠశాలలో ఏర్పడిన ఉపాధ్యాయుల కొరతను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి ఉపాధ్యాయుల కొరతను సరిచేసి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల లేకపోవడంతో తరగతుల నిర్వాహణ కష్టంగా ఉంది. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్న ఉపాధ్యాయులనే సర్దుబాటు చేసుకుంటూ తరగతులను నిర్వహిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు నిత్యం బోధించేలా చర్యలు తీసుకొంటున్నాం. ఉన్న ఉపాధ్యాయ సిబ్బంది శారీరకం, మానసికంగా అలసటకు గురవుతున్నారు.

– ఎస్.విశ్వనాథం, హెచ్‌ఎం, ప్రభుత్వోన్నత పాఠశాల

పరిస్థితి అర్థం కావడంలేదు



ఒడియా మీడియ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో మాకు చాలా ఇబ్బందిగా ఉంది. మేము పాఠశాలలో చేరినప్పటి నుంచి ఒడియాలోనే పాఠాలు నేర్చుకున్నాం. ప్రస్తుతం మా పదో తరగతి ఒడియా మీడియం విద్యార్థులకు ఇంగ్లిషు మీడియంలో బోధన చేస్తుండడంతో అర్థం చేసుకోలేకపోతున్నాం. ఒడియా మీడియం టీచర్లను నియమిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

–తారకరామ్‌ప్రాత్రో, పదో తరగతి విద్యార్థి

పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి



పాఠశాలలో ఉపాధ్యాయులను పూర్తిస్థాయిలో నియమిస్తే విద్యార్థులందరికీ న్యాయం జరుగుతుంది. ఇంత పెద్ద స్కూల్లో టీచర్లు లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అనుకున్న స్థాయిలో ఎక్కువ మార్కులు సాధించగలమా అనే భయం మమ్మల్ని వేదిస్తుంది.

– బెనర్జి, టెన్త్ విద్యార్థి

సైన్స్ టీచర్లను నియమించాలి



ఒడియా మాధ్యమంలో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఫిజిక్స్, బయాలజీ సైన్స్ క్లాసులు బోధించే ఉపాధ్యాయులను నియమించాలి. కష్టమైన సబ్జెక్టులలో సైన్స్ కూడా ఒకటి. ఈ సబ్జెకులను బోధించే టీచర్ లేకపోవడంతో ఒడియా మీడియం విద్యార్థులు చాలా నష్టపోతున్నారు.

–నందిని మహరాణ, 9వ తరగతి విద్యార్థిని

కోడిగుడ్ల సరఫరాలో జాప్యం!



కోటబొమ్మాళి గోదాంలో స్టాకున్న కోడిగుడ్లు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలోని కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరాలో జాప్యం నెలకుంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక సరఫరాల్లో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. ఈ రెండు మండలాల్లో 213 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటికి నెలకు ఒకలక్షా 92 వేల గుడ్లను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నాలుగు విడతల్లో సంబంధిత కాంట్రాక్టర్ సరఫరా చేయాల్సి ఉంది. ప్రతి నెలా 25 నుంచి 30వ తేదీ వరకూ మొదటి విడత, రెండు నుంచి ఐదో తేదీ వరకూ రెండో విడత, పది నుంచి 15వ తేదీ వరకూ మూడో విడత, 20 నుంచి 25వ తేదీ వరకూ నాలుగో విడతగా గుడ్లను కేంద్రాలకు చేరవేయాలి. అయితే ఈసారి 17వతేదీ గడిచినప్పటికీ మూడో విడత కోడిగుడ్లు పంపిణీ చేయలేదు. దీంతో ప్రసుత్తం అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు నిల్వ లేవు. 15వ తేదీకే సరఫరా చేయాల్సిన గుడ్లు శనివారం నాటికి కాంట్రాక్టర్ గొదాంలోనే నిల్వచేసి ఉంచడం విశేషం. ఆదివారం కేంద్రాలకు సెలవు కాబట్టి సోమవారం నాటికి కూడా కేంద్రాలకు గుడ్లను సరఫరా చేసే అవకాశం లేదు. ఐసీడీఎస్ అధికారులు స్పందించి సకాలంలో గుడ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీవో చింతాడ హైమావతి వద్ద ప్రస్తావించగా.. గుడ్లు సరఫరాలో జాప్యం తన దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



మోహన్‌సాహు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కవిటి: మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కంచిలి: కొక్కిలిపుట్టుగ పంచాయతీ పరిధి ఆముదాలపుట్టుగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మోహన్‌సాహు(63) మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నాయకులు మృతిని కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. మోహన్‌సాహు చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక నేతలు గంగాధర్ సాహు, మండల కో–ఆప్షన్ సభ్యుడు అనాది దొలాయి ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ..

కవిటి: మండలంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం పరామర్శించారు. కొత్తపుట్టుగలో మామిడి హరిబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. రాపాకపుట్టుగలో కరగాన పాపమ్మ చనిపోవడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట పలువురు నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



సంతబొమ్మాళి: క్విజ్ పోటీల్లో విద్యార్థులు



ఇచ్ఛాపురం: వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కాశీబుగ్గ: చిత్రలేఖన పోటీల్లో చిన్నారులు

సంతబొమ్మాళి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయంలో హైస్కూల్ విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు అందస్తామని గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

ఇచ్ఛాపురం: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను లైబ్రేరియన్ పూర్ణచంద్రబెహర పర్యవేక్షణలో నిర్వహించారు. 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం'అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: కాశీబుగ్గ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కె.యుగంధర్, పాపారావు పర్యవేక్షించారు. సునీత, స్వప్న, మోహన్‌రావు మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.రాంబాబు, హేమంత్, బాలక్రిష్ణ, పద్మావతి పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సోంపేట: జింకిభద్ర గ్రామంలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా నమఃశివాయ సంకీర్తన భక్తులచే ప్రత్యేక పూజలు, భజనలు ఆదివారం జరిగాయి. శివునికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ పూజల్లో పాల్గొన్నారు.

అండర్ పాసెజ్ పనులు ప్రారంభం



అండర్ పాసెజ్ వద్ద పనులు జరుగుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం కిష్టిపురం రైల్వే అండర్ పాసెజ్ మరమతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. అండర్ పాసెజ్ పాడవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు మరమ్మతులు జరుగుతున్నాయి. పనులు పూర్తయ్యే వరకూ అండర్ ప్రాసెస్ మార్గాన్ని మూసివేస్తామని.. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి శంకుస్థాపన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పాత జాతీయ రహదారికి సమీపంలో ఉన్న పద్మనాభపురం గ్రామంలోని అమ్మ ఆశ్రమం (దత్త అయ్యప్ప స్వామిదేవాలయం) ప్రాంగణంలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు శంకుస్థాపన ఆదివారం జరిగింది. వ్యవస్థాపకులు రామానందస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గురుస్వామి కొండే నరసింహ, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, న్యాయవాది పైల రాజరత్నంనాయుడు, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు లొడగల కామేష్, స్థానికులు డొక్కర మాధవరావు, బతకల శ్రీను, కొండే తిరుపతిరావు, బతకల పులిరాజు, గుసిరి వీరాస్వామి, డొక్కరి సత్యనారాయణ, దుబ్బ రాజగోపాల్, సంపత్‌రావు జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

చివరి మజిలీకి తిప్పలు..



వరిచేనులో నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కన్నేవలసలోని శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి లేదు. దీంతో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించేదుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఇదే పరిస్థితి గ్రామస్తులకు ఎదురైంది. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందాడు. దీంతో గ్రామానికి కిలో మీటరు దూరంలో ఉన్న శ్మశానవాటికకు మృతదేహాన్ని వరిపొలాల మధ్యలో నుంచి తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు పడితే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటికకు రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి వైఎస్సార్ విగ్రహం కూడలి వద్ద గతంలో అధికారులు నిర్మించిన మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్సు గదులు కూలి పోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం ఎటువంటి మెయింటినెన్స్ లేకపోవడంతో తుప్పుపట్టి రూముల షట్టర్లు విరిగిపోతున్నాయి. దీంతో కొన్ని షాపుల్లో ఉన్న వ్యాపారులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏప్రమాదం వచ్చి పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–పలాస

నడకయాతన..



మందస మండలం సుకర్ణపురం పంచాయతీలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు శిథిలమ్యాయి. దీంతో ప్రజల నడక కోసం నరకయాతన పడుతున్నారు. కొర్రాయిగేటు నుంచి సువర్ణపురం గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు మరమ్మతులకు గురై అడుగడుగునా గోతుల మయమైంది. అధికారులు, పాలకులు మేల్కొని శిథిలమైన రోడ్డుకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

తీరం కళకళ..



కార్తీక ఆదివారం కావడంతో సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు తీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారితో తీరం కళకళలాడింది. మధ్యాహ్నం తీరం సమీపంలో ఉన్న తోటల్లో వన భోజనాలు చేసిన పర్యాటకులు సాయంత్రం సముద్రంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నౌపడ మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సంతబొమ్మాళి

కోయ నృత్యం..



ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ తల్లిని ఆదివారం ఆంధ్రా, ఒడిశా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి సంబరాలను ఊరేగింపుగా వచ్చి జరుపుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటం, కోయ నృత్యాలతో కళాకారులు అలరించారు.

–ఇచ్ఛాపురం రూరల్

ప్రోటోకాల్‌పై రచ్చ!



మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

కాశీబుగ్గ: మందస మండలంలో ఎక్కడ అభివృద్ధి పనులు ప్రారంభమైనా శిలాఫలకాల ఏర్పాటులో ప్రోటోకల్ పాటించడం లేదని, తమ పేర్లను శిలాఫలకంపై వేయడం లేదని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్ అధ్యక్షతన మండల సాధారణ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను లేవనెత్తారు. అన్నదాతలకు రైతుభరోసా చెల్లించలేదని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని కొండాలోగాం ఎంపీటీసీ సభ్యురాలు సవర ఢిల్లీశ్వరి అధికారులను నిలదీశారు. రైతు భరోసా కింద ఏటా రూ.20 వేలు ఇస్తామన్నప్పటికీ రైతులకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలుపై స్పష్టత లేదని, కొంతమంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సొమ్ము జమకాలేదని, ఎల్‌పీ నంబర్‌తో అన్నదాతలు సబ్ రిజిస్టర్ కార్యాలయం చుట్టూ అవస్థలు పడుతున్నారని హరిపురం, మందస, బుడంబో, సిరిపురం ఆస్పత్రుల్లో సిబ్బంది విధులకు దుమ్మా కొట్టి రోగులకు వైద్య సేవలు అందించడం లేదని సర్పంచ్‌లు తలగన చంద్రశేఖర్, మాధవరావు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీడీవో పైల సూర్యనారాయణ రెడ్డి కలుగజేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. మందస మండలం ఉద్దానం ప్రాంతంలోని రట్టి బెతలాపురం పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భాల్లో ప్రోటోకల్ పాటించకుండా వివక్షత చూపి సంబంధం లేని వ్యక్తులు పేర్లు దర్శనమివడంపై సభ్యులు అధికారులను నిలదీశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయడం లేదని కొంత మంది సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సరవ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ శివప్రసాద్, ఎంపీడీవో పైల సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ హైమావతి ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



ప్రయాణికుల సామగ్రిని తనిఖీ చేస్తున్న పోలీసులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి స్థానిక పోలీసులు తనిఖీలు చేపట్టారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్టు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు. రైల్వే ప్రయాణికుల సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సోంపేట సీఐ బి.మంగరాజు సారథ్యంలో పోలీసు జాగిలాల సహాయంతో ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.